తాగునీటి కష్టాలకు చెక్ !

- పెనుకొండలో రూ. 87 కోట్లతో అమృత్–2 పనులు
- నూతనంగా 9 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం
- త్వరలోనే పూర్తికానున్న టెండర్ల ప్రక్రియ

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద రూ. 87 కోట్ల రూపాయలను మంజూరు చేయడంతో పెనుకొండ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు పూర్తిగా చెక్ పడనుంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

పెనుకొండకు వరం

నూతనంగా వేసిన ప్రధాన రహదారులతో పైప్‌లైన్‌లు పగిలి పోవడం, మోటార్లు చెడిపోవడం ఇతరత్రా సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టాలని నిర్ణయించిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అమృత్ 2.0 కింద రూ. 87 కోట్లు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి పూర్తి మ్యాప్‌ను సిద్ధం చేయించారు. త్వరలో ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కానుంది. పెనుకొండ పట్టణ పరిధిలో 42 వేల మంది జనాభా, 8500 కుటుంబాలు ఉన్నాయి. దీంతో అమృత్ 2.0 పెనుకొండకు వరంగా పట్టణవాసులు భావిస్తున్నారు.



నీటి శుద్ధి చేయనున్న మదర్ ప్లాంట్ ఇదే

నూతనంగా 9 ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం

అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలో నూతనంగా 9 ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించనున్నారు. వెంకటరెడ్డిపల్లి, జర్నలిస్ట్ కాలనీ, షీఫారం, మారుతి నగర్, ఆర్అండ్‌బి ఆఫీస్, ఉప్పర్‌బాడ, వెంకటాపురం తండా, రాంబురుజు మరో ప్రాంతంలో ఈ ట్యాంక్‌లను నిర్మించనున్నారు. ప్రస్తుతం 4 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా అదనంగా మరో 9 ట్యాంకులు నిర్మించనుండడంతో మున్సిపల్ పరిధిలో శాశ్వతంగా నీటి సమస్య తీరనుంది.


గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తిమ్మాపురం వద్ద ఉన్న సంప్‌కు చేరుతున్న తాగునీరు

24 గంటలు నీటి సరఫరా

అమృత్ 2.0 పథకంలో భాగంగా 24 గంటలూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలకు అధికారులు నీటిని అందించనున్నారు. పంపింగ్ సిస్టం ద్వారా తిమ్మాపురం వద్ద ఉన్న సంప్‌కు నీరు చేరనుండగా అక్కడున్న వైఎస్సార్ సుజల ప్రవంతి ప్యూరిఫైడ్ మదర్ వాటర్ ప్లాంట్‌లో నీరు ఫిల్టర్ అయిన తర్వాత ప్రజలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందులో భాగంగానే మున్సిపల్ పరిధిలో 90 కిలోమీటర్ల మేర నూతనంగా అధికారులు పైప్‌లైన్ వేయనున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అమృత్ 2.0 కింద పెనుకొండ పరిధిలో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. మున్సిపల్ పరిధిలో శాశ్వతంగా దాహార్తిని తీర్చాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే శంకరనారాయణ పట్టుబట్టి రూ. 87 కోట్లు మంజూరు చేయించారు. 9 వాటర్ ట్యాంక్‌లు, 90 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేస్తారు.

– వంశీకృష్ణ భార్గవ్, కమిషనర్, పెనుకొండ


ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	: 35.0
పెనుకొండ	: 38.0
మడకశిర	: 35.0

డీఐజీని కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి


రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అనంతపురంలో మంగళవారం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని ఎమ్మెల్యే తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీకి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మడకశిర పోలీస్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుళ్ల కొరత అధికంగా ఉందని డీఐజీ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. కానిస్టేబుళ్లను పూర్తి స్థాయిలో నియమించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కానిస్టేబుళ్ల కొరత తీర్చేలా చర్యలు తీసుకుంటామని డీఐజీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కరుణాకర్



అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ మంగళవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పూలమాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

12న మండల మీట్

చిలమత్తూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12 న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆలయంలో హుండీ చోరీ

అమరాపురం: మండల పరిధిలోని హల్కూరు గ్రామ సమీపంలోని దొడ్డగట్టమ్మ తల్లి, కరియమ్మ తల్లి ఆలయంలో దొంగతనం జరిగింది. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని, అమ్మవారి మెడలోని బంగారు తాళిబొట్టును సోమవారం రాత్రి దుండగులు దొంగలించారని మంగళవారం కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు హుండీలో రూ. 25 వేల వరకు నగదు ఉంటుందన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి


హిరేతుర్పిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి

గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మంగళవారం ఆమె హిరేతుర్పి గ్రామంలో నిర్వహించి 104 సేవలు, ఫ్యామిలీ సేవలను పరిశీలించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిప్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

మడకశిర: నియోజకవర్గంలో పీఆర్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పీఆర్ డీఈ పద్మావతి కోరారు. మంగళవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆమె నియోజకవర్గంలోని 5 మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. 5 మండలాల పరిధిలో జరుగుతున్న నాడు–నేడు పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం పనులు, సచివాలయ భవనాలు, హెల్త్ క్లినిక్ భవనాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు తదితర అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పనులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పనులను నాణ్యంగా చేయాలని కోరారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించబోమన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథగుప్తా

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి సమీపంలో ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుతో పాటు నాణ్యతా ప్రమాణలను పరిశీలించారు. నిబంధనల మేరకు కొలతలు ఉంటేనే కూలీ గిట్టు అవుతుందని, కొలతలు ప్రకారం మట్టి తవ్వి రోడ్డుకు వేయాలని కూలీలకు సూచించారు.

ఇళ్లు మంజూరు చేయండి

పెనుకొండ: పట్టణంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్ కోరారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ ఆయనతో పాటు పలువురు పట్టణ వాసులు తహసీల్దార్ కార్యాలయం దగ్గర మంగళవారం నిరసన వ్యక్తం చేసారు. స్పందించిన తహసీల్దార్ అర్హులైన పేదల జాబితా ఇవ్వాలని, విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటరాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయండి


ప్రభుత్వ సలహాదారు సజ్జలకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హిందూపురం: నాలుగేళ్లుగా పట్టురైతులకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిలు రూ.50 కోట్లు విడుదల అయ్యేలా కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని పురం పట్టు రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టు రైతుల తరపున రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దారెడ్డి, పరిగి రాజేష్, శంకర, రామకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి అమరావతిలో వినతిపత్రం అందజేశారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా పట్టు పరిశ్రమశాఖ కమిషనరేట్‌ను శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. సజ్జల సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అన్ని విషయాలను సీఎం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారన్నారు.

ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్తు

రొళ్ల: విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రొళ్ల, అగళి మండలాల్లో పదో తరగతి, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో చదువుతూ డ్రాప్ ఔట్స్ (బడి బయట) విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతు విద్యార్థులు చదువు మధ్యలోనే మానుకొని ఖాళీగా ఉండ కుండా వివిధ వృత్తి కోర్సులు చేరి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అదేవిధంగా ఇటీవల విడుదల అయిన పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 29న హిందూపురంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఆర్డీటీ నిర్వహించనున్న రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని వివిధ కార్పొరేట్ కళాశాలల్లో చదివించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ నాగమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రొళ్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీ మల్లికార్జున

నాడు- నేడు పనుల పరిశీలన


నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న జేసీ చేతన్

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ నాడు – నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనులను పరిశీలించి నిధులు విడుదలైనా పనులు జాప్యం తగదన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనాలను అక్కడక్కడా నిర్మించకూడదని, ఆర్డర్‌లో ఉండేలా చూడాలన్నారు. అంతకు ముందు ఆయన చలివెందుల, నడింపల్లి, రాశిపల్లి, మరకుంటపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులతో రైల్వేలైన్‌కు వెళుతున్న భూములకు సంబంధించి పరిహారం విషయమై చర్చించారు. సబ్ రిజిష్టర్ కార్యాలయంలో భూమి విలువ పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ కార్తీక్, ఎంపీడీఓ శివశంకరప్ప పాల్గొన్నారు.

కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

హిందూపురం: వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలు, ఇతర వ్యాపకాల బాట పట్టకుండా ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా అన్నారు. సీనియర్ కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్ మైదానంలో ఉచిత కరాటే , జూడో శిక్షణ తరగతులను ప్రారంభించారు. జమియా మసీదు ముత్తవల్లి నూరుల్లాఖాన్, స్కూల్‌హెచ్‌ఎం అక్బర్‌షరీఫ్, శిక్షకులు బాబాఫ కృద్దీన్, రియాజ్‌బాషా, ప్రవీణ్ కుమార్, సాదిక్‌బాష తదితరులు పాల్గొన్నారు.

సజావుగా చేపల చెరువు వేలం

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు మేజర్ పంచాయతీ పరిధిలోని రెండు చెరువుల్లో చేపల పెంపకానికి నిర్వహించిన వేలంపాట ద్వారా ప్రభుత్వానికి రూ.1.26 లక్షల ఆదాయం లభించింది. సర్పంచ్ సంధ్య అధ్యక్షతన కార్యదర్శి నాగరాజు వేలంపాట నిర్వహించగా... పాతచామలపల్లి చెరువును రామకృష్ణారెడ్డి రూ.56 వేలకు, తుమ్మలకుంట చెరువును లక్ష్మీనారాయణ రూ.70 వేలకు దక్కించుకున్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


మారెమ్మ ఆలయం దగ్గర భక్తులు జ్యోతులు సమర్పించిన దృశ్యం


పైడేటిలో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

పరిగి: మండలంలోని పైడేటిలో మంగళవారం స్థానిక మారెమ్మతో పాటు ముత్యాలమ్మ అమ్మవారికి ఘనంగా జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయాల కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయంలోని అమ్మవార్ల మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే స్థానిక మహిళలు ప్రత్యేకంగా అందంగా తీర్చిదిద్దిన జ్యోతులతో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సోదరుడు మాలగుండ్ల రవీంద్ర హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్

వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో మధ్యాహ్నం పైడేటి నుంచి హిందూపురం, కలిపి వైపునకు వెళ్లే రోడ్డు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పైడేటి సర్కిల్‌లో గంటల తరబడి వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. ఎస్‌ఐ సరేంద్ర సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. అదేవిధంగా జ్యోతుల ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును నిర్వహించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిర(అగళి): మండలంలోని రామనపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రేణుకా యల్లమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో యల్లమ్మదేవి

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ – పెనుకొండ ప్రధాన రహదారి పక్కన వెలసిన రేణుక యల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవ సంబరాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా మండలంలోని శేషాపురం, తాడంగిపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

రొద్దం: మండల పరిధిలోని శేషాపురం గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న షరిపుద్దీన్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు. అతని వద్ద నుంచి 25 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే తురకలాపట్నంలో ఓ దొంగను గ్రామస్తులు పట్టుకుని తమకు అప్పగించారన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులు, కూలీల సంఖ్య పెంపుపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలంటీర్ల ద్వారా పనులపై కూలీలకు అవగాహన కల్పించే విధంగా చూడాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి సమస్యలపై వచ్చి అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మహిళలు, దివ్యాంగులు, యువకుల ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఏఆర్వో సుజాత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సుమారు 50 శాతం మహిళలే ఓటు వినియోగించుకునే పోలింగ్ కేంద్రాల్లో మహిళలే పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కోటగుడ్డ–1, పావగడ–3,కృష్ణాపురం–1లో మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, దివ్యాంగ ఓటర్ల పోలింగ్ స్టేషన్ పట్టణంలోని కస్తూర్బా వసతి పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి వీలుగా నియోజకవర్గంలోని 5 మండలాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అగళి మండలానికి జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, అమరాపురం మండలానికి అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, గుడిబండ మండలానికి ఏపీఎస్పీ డీసీఎల్ డీఈఈ మోసెస్, మడకశిర మండలానికి జిల్లా కోపరేటివ్ అధికారి కృష్ణానాయక్, రొళ్ల మండలానికి గనులశాఖ ఏడీ రామ్మోహన్‌రావులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


బుళ్లసముద్రం ఆర్బీకేలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని తిలకిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు, వ్యక్తిగత స్థాయిలో ప్రధాన సమస్యల సత్వర పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. మండలంలోని గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు, మహిళలు జగనన్నకు చెబుదాం ప్రారంభం కార్యక్రమాన్ని తిలకించారు. సర్పంచులు మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కరం కాని సమస్యలు, సంక్షేమ పథకాల మంజూరు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలను సంబంధిత వ్యక్తులు 'జగనన్నకు చెబుదాం' 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు చెప్పితే సత్వరమే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

నేడు సార్వత్రిక ఎన్నికల 'పోలింగ్ '

- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- భద్రత నడుమ పోలింగ్ సామగ్రి తరలింపు

పావగడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎస్సీ రిజర్వ్ విధాన సభ క్షేత్రం పోలింగ్ బుధవారం జరగనుంది. మొత్తం 1,93,007 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప, బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్, కేఆర్పీపీ అభ్యర్థి నేరళకుంటె నాగేంద్ర తదితరులు తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. మంగళవారం మొత్తం 246 పోలింగ్ కేంద్రాల వద్దకు భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల సామగ్రిని పోలింగ్ అధికారులు ప్రత్యేక బస్సుల్లో తరలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల ఆర్వో అతిక్ పాషా ఎన్నికల సిబ్బందికి విధి విధానాలు తెలియజేశారు. అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రాల అధికారులకు ఈవీఎం బాక్సులను అప్పగించారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పోలీసులు గుర్తించిన మేఘలపాళ్య, వైఎన్ హొసకోట, లింగదహళ్లి, హొట్టేబొమ్మనహళ్లి, ముద్దగానహళ్లి, హనుమనబెట్ట, రాచమారనహళ్లి, కామనహట్టి, వెంకటమ్మనహళ్లి, కేటి హళ్లి, హొసహళ్లి, జంగమరహళ్లి, కే సేవాలాల్ పుర, తిమ్మలనాయకనకోటె, అప్పాజి హళ్లి, హనుమయ్యనపాళ్య, వెంకటాపుర, గుమ్మఘట్ట పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.


పోలింగ్ కేంద్రాల వద్దకు ఈవీఎం బాక్స్‌లతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

'పది' ఫలితాల్లో పావగడ టాప్


కళ్యాణి


నందన్


శోభ


వర్ష

పావగడ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పావగడ తాలూకా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు స్థానిక బీఈఓ అశ్వర్థనారాయణ తెలిపారు. పది పరీక్షలను మొత్తం 2,813 మంది రాయగా... 2715 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. పావగడ 96.53 శాతం ఫలితాలతో పావగడ తాలూకా జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కొడిగేనహళ్లి మొరార్జి వసతి పాఠశాలలో నందన్ అనే విద్యార్థి 619, శోభ 618, వర్ష 618 మార్కులు సాధించారన్నారు. గుజ్జనడు మొరార్జీ వసతి పాఠశాల విద్యార్థిని కళ్యాణి 593 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు వన్నె తెచ్చారన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

మడకశిరరూరల్: మండలంలోని గుర్రుపుకొండ గ్రామంలోని మడకలకుంట మారెమ్మ దేవత, గ్రామ దేవతలకు మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లల్లో బంధు మిత్రులకు విందు భోజనాలు వడ్డించారు.